అధ్వానంగా మోడల్‌కాలనీ రహదారులు

గుంతలు పడి కంకర తేలినా పట్టించుకోని అధికారులు

బేగంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లో పచ్చని చెట్లకు నిలయంగా ఉన్న మోడల్ కాలనీలో పలు రహదారులు పూర్తి అధ్వానంగా మారాయి. ప్రధానంగా కాలనీలోని పార్కుకు రాకపోకలు సాగించే రహదారి గుంతలు పడి.. కంకర పైకి తేలి అధ్వానంగా ఉంది. రెండు సంవత్సరాలుగా ఈ రహదారి నిర్మాణం కోసం కాలనీవాసులు అధికారులకు పలుసార్లు వినతులు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలోని పలు రహదారుల్లోని గుంతల్లో నుంచి కంకర పైకి తేలడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కాలనీలో ఉన్న స్థానికులు నిత్యం అధ్వానంగా ఉన్న రహదారి నుంచే వాకింగ్ కోసం పార్కులకు వెళ్తుంటారు. రహదారిలోని గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల మూడు రోజులుగా కురిసిన వర్షాలకు గుంతలు పడిన రోడ్లు పూర్తి అధ్వానంగా మారాయి. రాకపోకలు సాగించే సీనియర్ సిటిజన్స్ నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. కాలనీకి ఉన్న ప్రధాన రహదారి నిర్మాణంలో ప్రస్తుత అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.



గుంతలు పడి అధ్వానంగా మోడల్ కాలనీ ప్రధాన రహదారి

రహదారుల నిర్మాణానికి రూ.80 లక్షలు

గత ప్రభుత్వ హయాంలో మోడల్ కాలనీ ప్రధాన రహదారితో పాటు పలు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వీటితోపాటు కాలనీలో పలు అభివృద్ధి పనులకు సైతం అనుమతులు వచ్చాయి. టెండరు ప్రక్రియ జరుగుతున్న క్రమంలో ప్రభుత్వం మారిపోవడంతో ఈ పనులకు గ్రహణం పట్టింది. కాలనీలోని పార్కుకు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సుమారు రూ.80 లక్షల నిధులను మంజూరు చేశారు. వీటితో పాటు కాలనీలో అసంపూర్తిగా ఉన్న పలు కార్యక్రమాల కోసం నిధులను మంజూరు చేయడంతో టెండర్ ప్రక్రియ అనంతరం పనులు జరుగుతాయని కాలనీవాసులు అనుకున్నారు. టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడంతో ఈ క్రమంలో జరిగిన ఎన్నికల్లో కొత్త ప్రభుత్వం వచ్చింది. దీంతో గత ప్రభుత్వంలో మంజూరైన రోడ్డు పనులు ఆటకెక్కాయి. కాలనీవాసులు ఈ విషయంపై పలుమార్లు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను కలిసినా వారు పొంతన లేని సమాధానాలు చెప్పారని పలువురు తెలిపారు. దీంతో కాలనీ రహదారుల నిర్మాణం ఆగిపోయిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కాలనీ పార్కుకు వెళ్లే రోడ్డులో పడిన గుంతలు

రోడ్ల నిర్మాణం చేపట్టాలి



మోడల్ కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులను వెంటనే నిర్మించాలి. ప్రధాన రహదారి నిర్మాణానికి గతంలో రూ. 80 లక్షల నిధులు మంజూరయ్యాయి. రోడ్ల నిర్మాణం జరగలేదు. ఆ నిధులు ఏమయ్యాయని అధికారులను అడిగినా సమాధానం ఇవ్వడం లేదు. ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా మారడంతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి.

● జేఎస్టీ సాయి, సీనియర్ సిటిజన్, మోడల్ కాలనీ



నిర్మలాసీతారామన్‌ను కలిసిన రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం ప్రతినిధులు

నిర్మలమ్మా.. సహకరించండి

ఖైరతాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ కులస్థులను బీసీ 'డి' జాబితా నుంచి ఓబీసీ జాబితాలోకి మార్చేందుకు సహకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆ సంఘం ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఆమెను పార్లమెంట్‌లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్‌పాటిల్, కోశాధికారి కళ్లపల్లి రాచప్ప, సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టి శివ తదితరులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. బీసీ నుంచి ఓబీసీలోకి 28 కులాలను చేర్చాలనే ప్రతిపాదనతో తాము ఢిల్లీ వచ్చామని, ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులను, తెలంగాణ ఎంపీలను కలశామని సంఘం ప్రతినిధులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

హైటెక్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ దుర్గంచెరువులోకి దూకి ఓ యువకుడు మృతిచెందాడు. మాదాపూర్ ఎస్‌ఐ వినయరావు తెలిపిన వివరాల ప్రకారం.. తిరమలగిరి ఆర్టీసీ కాలనీకి చెందిన చంద్రేష్ జైన్ (34) వ్యాపారి. ఈనెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి వరకు ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు అల్వాల్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. ఫిర్యాదు చేసిన రోజే చంద్రేష్ జైన్ మృతదేహం దుర్గంచెరువులో కనిపించడంతో పోలీసులు బయటకు తీయించారు. పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు తరుణ్ జైన్ ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చంద్రేష్ జైన్(ఫైల్)

ఇంటికొచ్చి దాడి చేశారు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చూపులకు ఇంటికి వచ్చి దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన టి.సుకన్య సోదరి కుమారుడు రాహుల్ పెళ్లిచూపుల కోసం ఫిబ్రవరిలో బాలాపూర్‌కు చెందిన అనిల్ కుమార్, పద్మ దంపతుల ఇంటికి వెళ్లారు. అనంతరం అనిల్ కుమార్ దంపతులను సుకన్య ఇంటికి మాట్లాడేందుకు పిలిచారు. మాట్లాడుతున్న సందర్భంలో అనిల్ కుమార్ తమ్ముడు వెంకటేష్ పోలీస్ అధికారినని చెబుతూ ఇంట్లోకి వచ్చి అసభ్యకరమైన బూతులు తిట్టి, తలుపులు గడి పెట్టి దాడి చేశారు. ఇంటికి వచ్చి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సుకన్య శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేసి రాచకొండ పరిధిలోని బాలాపూర్ పీఎస్‌కు కేసును బదిలీ చేశారు.

రియల్ మోసం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్లాట్‌కొని పూర్తి డబ్బులు చెల్లించినా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంకే నగర్‌కు చెందిన ఎం.ధనలక్ష్మి జహీరాబాద్‌లో స్థలాన్ని రూ.3.75 లక్షలకు ఏజెంట్ బి.సాయిలు ద్వారా కొనుగోలు చేసింది. ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయకుండా కాలాక్షేపం చేయడంతో రియల్ ఎస్టేట్ ఆఫీస్‌కు వెళ్లింది. ఆఫీసును తీసివేయడంతో ధనలక్ష్మి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది.

ద్విచక్ర వాహనం మాయం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన వి. గంగాధర్‌రావు జూలై 30న కృష్ణకాంత్ పార్కు ఎదుట రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని పార్కు చేశాడు. కొంతసేపటికి వెళ్లి చూడగా బైక్ కనిపించ లేదు. దీంతో పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు.



జవహర్‌నగర్‌కాలనీ మజీదుగడ్డలో సివరేజ్ సమస్యలపైన జలమండలి మేనేజర్ సూర్యప్రకాష్‌తో కలిసి కార్పొరేటర్ దేదీప్య పర్యటించారు. డ్రైనేజ్ ఓవర్ ఫ్లోకు శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు.
● పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన సీనియర్ న్యాయవాది బాచిన హనుమంతరావు
● బేగంపేట, ఆంధ్రజ్యోతి



గాజులరామారంలోని కేవీఎస్ కన్వెన్షన్‌లో జరిగిన కూన వెంకటేష్‌గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కుమారులు కూన శ్రవణ్‌గౌడ్, కూన గౌరీశంకర్‌గౌడ్‌తో కాంగ్రెస్ నేత విశాల్ సుధాం
● బేగంపేట, ఆంధ్రజ్యోతి

ముమ్మరంగా శానిటేషన్ డ్రైవ్

ఖైరతాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శానిటేషన్ డ్రైవ్ జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో ముమ్మరంగా సాగుతోంది. రెండు రోజుల పాటు ఒక వార్డులో డ్రైవ్‌లు నిర్వహించి అందులో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ప్రత్యేక వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ఇందులో భాగంగా సర్కిల్-17లో ఇప్పటికే రూ.35 వేల జరిమానాలు విధించినట్టు ఉప కమిషనర్ జయంత్ తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్ ఎదుట తవ్వకాలు జరిపి వ్యర్థాలను అక్కడే వదిలేసినందుకు రూ.5 వేలు, ఎల్లారెడ్డిగూడలోని స్క్రాప్ వ్యాపారి ఫుట్‌పాత్‌పై స్క్రాప్ మెటీరియల్‌ను వేయడంతో ఆయనకు రూ.25 వేల జరిమానాను ఉప కమిషనర్ విధించారు. దీంతోపాటు పలు ప్రాంతాల్లో రోడ్లపై అనుమతి లేకుండా వ్యర్థాలను జారవిడిచిన నలుగురికి రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇప్పటి వరకు ఖైరతాబాద్, సోమాజిగూడ వార్డుల్లో డ్రైవ్ పూర్తి కాగా, అమీర్‌పేట, సనత్‌నగర్‌లలో జరగాల్సి ఉంది. ఇక జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ఇప్పటికే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వార్డుల్లో శానిటేషన్ డ్రైవ్ పూర్తికాగా, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట వార్డుల్లో చేయాల్సి ఉన్నదని ఉప కమిషనర్ సమ్మయ్య తెలిపారు.



గురుమూర్తి లేన్ సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహేశ్వరి

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక పైపులైన్

బేగంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లోని గురుమూర్తి లేన్‌లో పలు విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్ టి.మహేశ్వరి శుక్రవారం పర్యటించారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పలువురు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక సివరేజీ పైపులైన్ కోసం నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకుడు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ విజేత లక్ష్మి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏఐటీఏ జాతీయ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి లక్ష్మిశ్రీ విజేతగా నిలిచింది. శుక్రవారం యాష్ టెన్నిస్ అకాడమీలో జరిగిన ఫైనల్‌లో లక్ష్మి శ్రీ 6-1, 2-6, 4-1 (రిటైర్డ్)తో జోయెల్ నికోల్ (తమిళనాడు)పై గెలిచి టైటిల్ సాధించింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో లక్ష్మిశ్రీ 6-1, 6-3తో మనోజ్ఞ (తెలంగాణ)ను ఓడించి ఫైనల్‌లో ప్రవేశించింది.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

● మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

బోరబండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్-2 మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో అధికారులు, నాయకులతో కలిసి రేషన్‌కార్డులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం కాడ 'నో పాలిటిక్స్' అని స్పష్టం చేశారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన వారందరికీ ఇస్తామని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో అధికార పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గం పరిధిలో 5,284 రేషన్‌కార్డులు, 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు. ఎక్కడో కొల్లూరులో కాకుండా లబ్ధిదారులకు చేరువలోనే ఇళ్లను కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఇన్‌చార్జి డీఎస్‌ఓ శ్రీనివాస్, కార్పొరేటర్లు సి.ఎన్.రెడ్డి, దేదీప్యరావు, సంగీతయాదవ్, రాజ్‌కుమార్ పటేల్, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో రాత్రివేళ గస్తీ ముమ్మరం

ఖైరతాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో యువకులు అర్ధరాత్రి బాతాఖానీ కొట్టడం, రోడ్లపై సరదాలు చేసుకోవడం, ఆటోలలో కాలక్షేపం చేయడాలు కుదరవని ఖైరతాబాద్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. మూడు రోజులుగా ఖైరతాబాద్‌లో పోలీసులు హల్‌చల్ చేస్తూ అన్ని ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేశారు. ఇటీవలే రౌడీమూక దాడితో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ నేపథ్యంలో ఖైరతాబాద్ ఏసీపీ స్థానికులతో సమావేశం నిర్వహించగా అందులో పలు సమస్యలను తెలియజేశారు. దీంతో పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. రెండు రోజులుగా ఖైరతాబాద్‌లోని అన్ని బస్తీల్లో రాత్రి 11 గంటలు దాటిన అనంతరం రోడ్లపై ఉన్న వారిని పంపించేస్తుండగా, అర్ధరాత్రి సమయాల్లో ఆటలు ఆడడం కుదరదని ఆట స్థలాలకు తాళాలు వేస్తున్నారు. మారుతీ నగర్‌లో అడ్డదిడ్డంగా పెడుతున్న పార్కింగ్‌లపై తనిఖీలు చేసి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న వాటిని తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఏసీపీ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు.



మారుతీనగర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఖైరతాబాద్ పోలీసులు

బోరబండలో ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలి



ఇబ్రహీం గుల్షనీ మసీదు ఆవరణలో ఆందోళన చేస్తున్న ముస్లింలు

బోరబండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బోరబండ ప్రాంతంలో నివసిస్తున్న ముస్లింల ఖబరస్తాన్ కోసం స్థలం కేటాయించాలని మసీదుల్లో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. బోరబండ ఖబరస్తాన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రార్థనల అనంతరం డివిజన్ పరిధిలోని మసీదుల వద్ద ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ఆందోళనలో పాల్గొన్నారు. కొన్నేళ్లుగా అల్లాపూర్ ప్రాంతం రాజీవ్‌గాంధీ నగర్ ఖబరస్తాన్‌లో బోరబండ వాసుల అంత్యక్రియలు జరిగేవని, ఆ స్థలం కూడా నిండిపోవడంతో అక్కడి వారు అభ్యంతరం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోరబండ ప్రాంతంలో ఖబరస్తాన్ కోసం స్థలం కేటాయించాలని వక్ఫ్‌బోర్డు, కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు పలుమార్లు తిరిగామని తెలిపారు. బోరబండ సైట్-2 కాలనీలో పీలీదర్గా వద్ద సర్వేనెంబర్.127లో 2.16 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నదని, అందులో ఒక ఎకరం 4 గుంటల స్థలం తమకు చెందుతుందంటూ స్థానిక ఎన్ఆర్ఆర్ పురం గృహనిర్మాణ సంఘం కోర్టులో కేసు వేసిందని, మిగిలిన ఎకరం 12 గుంటల స్థలాన్ని ముస్లింల ఖబరస్తాన్ కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ మసీదుల ఇమాంలతో పాటు బోరబండ ఖబరస్తాన్ కమిటీ ప్రతినిధులు సయ్యద్ ముకరం, జహంగీర్ ఖాన్, ఫయాజ్ ఖాన్, ఎం.డి.యూసుఫ్, జావెద్, ఎం.డి.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ మండలంలోని అమీర్‌పేట్ నంబర్-1 స్కూల్‌లో 120 మందికి డాక్టర్లు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కాచిగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డాకు చెందిన కె.బాలాజీ(35), కె.మారుతి(25) డ్రైవర్లు. రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. శుక్రవారం రాత్రి నింబోలి అడ్డా ప్రధానరహదారిపై ఆటో(టీఎస్07యూబీ9870)లో 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపారు.

జనహిత పాదయాత్రకు భారీ స్పందన

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జనహిత పాదయాత్రకు ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ మిత్రకృష్ణ పేర్కొన్నారు. పరిగి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర మొదటి రోజు ప్రజల నుంచి స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు.

నలుగురు దొంగలకు కఠిన కారాగార శిక్ష

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నలుగురు దొంగలకు రైల్వే కోర్టు యేడాది కఠిన కారాగార శిక్ష విధించిందని కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. 2024 ఏప్రిల్ 27వ తేదీన సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ఎంఎంటీఎస్ రైలులో వెళ్తుండగా యాకత్‌పుర వద్ద నలుగురు దొంగలు కత్తులతో బెదిరించి, మెడలో ఉన్న 2 తులాల బంగారు చైన్, రెండు సెల్‌ఫోన్లను లాక్కునిపోయారు. ఈ కేసుకు సంబంధించి... చంచల్‌గూడకు చెందిన మహ్మద్ ఇబ్రహీం(23), రెయిన్‌బజార్‌కు చెందిన మహ్మద్ తోహిద్(19), మహ్మద్ అనాసుద్దీన్(19), పిస్తల్‌బండకు చెందిన మహ్మద్ ముఖీద్(19) స్నేహితులు. జల్సాలకు అలవాటుపడి రైళ్లల్లో దొంగతనాలు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి రైల్వే కోర్టు జడ్జి శ్రీదేవి శుక్రవారం తీర్పు ఇచ్చారు. నలుగురికి యేడాది పాటు కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది. ఈ నలుగురిని జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు తెలియచేయునదేమనగా, నా క్లయింటు శ్రీ జి. రజినికాంత్ అనువారు, కొండాపూర్ గ్రామం, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లాలోని సర్వే నం. 104, 105, 106, 107 మరియు 108 లోని భూమి నిమిత్తం **"భగవాన్ శ్రీ బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్"** (ట్రస్ట్) అనే ఒక ప్రజా ధార్మిక సంస్థ చేసిన అర్థరహిత మరియు అనధికార పనుల వలన అన్యాయానికి గురి అయ్యారు. కొండాపూర్ గ్రామంలోని సర్వే నం. 104, 105, 106, 107 మరియు 108 లోని పూర్తి విస్తీర్ణం గల భూమి ఎ.85-32 గుంటలకు కొనుగోలు చేసి మరియు కొండాపూర్లోని సర్వే నం. 104, 105, 106, 107 మరియు పూర్తి 108లోని **AC. 60-06 గుంటల ఒరిజినల్ టైటిల్ డీడ్స్ డిపాజిట్** చేయుట ద్వారా ఒక మార్ట్‌గేజ్ డీడ్ తేది:04.03.1998లో తన పేరిట నిర్వహించిన తరువాత ట్రస్టు, IGPA హోల్డరు/ వెండార్ అయిన శ్రీ తిమ్మయ్యకు ట్రస్టు విక్రయ వెలను చెల్లించుటలో విఫలమయింది.

కానీ మార్ట్‌గేజ్ డీడ్‌లోని నిబంధనలను పాటించుటలో ట్రస్టువిఫలం అయినందున, అన్యాయానికి గురి అయిన సదరు శ్రీ లేట్ తిమ్మయ్య, కొండాపూర్ గ్రామంలోని సర్వే నం. **104/1/A, 104/2/A, 104/1/B, 104/1/C, 104/1/D, 106/A, 106/B, 106/C, 106/D, 107/A, 107/B, 107/C, 108/B, 108/C, 108/D, 108/E** లోని **AC 60.06 గుంటల విస్తీర్ణంగల** షెడ్యూలు భూముల స్వాధీనతను తిరిగి పొందుటతో సహా మార్ట్‌గేజ్ డీడ్‌ను ముందు ముగించుటకు గానూ ఒక దావా O.S No.845/2010 ని దాఖలు చేయగా అది గౌరవనీయ VIవ ADJ, రంగారెడ్డి, కూకట్‌పల్లి కోర్టు జిల్లా వద్ద ఈ కేసు పెండింగులో గలదు.

మార్ట్‌గేజ్ డీడ్ తేది. 04.03.1998 నిబంధనలను గౌరవించకుండా మరియు నా క్లయింటు **ఒరిజినల్ టైటిల్ డీడ్‌ను కొండాపూర్ యొక్క సర్వే నం. 104 నుంచి 108** వరకు కలిగి ఉండగా, 2000 సం.లో ట్రస్టు ఒక AGPA ను AC 43.00 గుంటలకు మెసర్స్ భూపతి అసోసియేట్స్ పేరిట నిర్వహించింది, మరియు మెసర్స్ భూపతి అసోసియేట్స్ చేసిన ప్రాతినిత్యం వలన, ప్రిన్సిపల్ సెక్రటరి, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారు, ట్రస్ట్ పేరు బదులుగా వారి పేరిట GO No.45, తేది. 06.05.2023 ను జారీచేసారు. 2023వ సంవత్సరంలో, **స్టేటస్ కో ఆర్డర్లు పెండింగులో ఉండగానే,** ట్రస్టు రెండు IGPA నం.18158/2023ను సర్వే నం.105 నుంచి 108లోని ఎ.15-29 గుంటల నిమిత్తం మరియు మరొక IGPA నం 894/- IV/2023, తేది.13.10.23ని కొండాపూర్లోని సర్వే నం. 105 నుంచి 108లోని ఎ.57-32 గుంటల నిమిత్తం మెసర్స్ ఫీనిక్స్ లివింగ్ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట నిర్వహించింది. నా క్లయింటు **W.P.No. 3384/2024** మరియు **W.P.No. 3695/2024** ద్వారా గౌరవనీయ తెలంగాణ హైకోర్టులో వాటిని సవాలు చేస్తూ రిట్ పిటిషన్లు పెండింగులో ఉన్నవి.

నా క్లయింటుకు విశ్వసనీయంగా తెలిసింది ఏమంటే, **ట్రస్టు, మెసర్స్ భూపతి అసోసియేట్స్ మరియు ఫీనిక్స్ లివింగ్ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మండవ ప్రభాకర్ రావు మరియు ఇతరులు ఒకరితో ఒకరు కుమ్మక్కైయ్యారు, W.P.No. 3384/2024** మరియు **W.P.No. 3695/2024 మెసర్స్ భూపతి అసోసియేట్స్ మరియు ఫీనిక్స్ లివింగ్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల యాజమాన్యాన్ని సవాలు చేస్తుండగా, జారీ చేయబడిన** G.O.M.S.No.45 మరియు ఐజిపిఎలను సవాలు చేస్తూ దాఖలు చేసిన అనేక రిట్ పిటిషన్లు పెండింగ్ ఉండగా, మూడవ పక్షంవారితో ఒప్పందాలను కుదుర్చు కుంటున్నారు. కాబట్టి ఆసక్తి గల కొనుగోలు దారులు, డెవలపర్లు, ఖాతాదారులు, డీలర్లు మొదలైన వారిని నా క్లయింటు హెచ్చరించేదేమంటే వారు **ట్రస్టు, మెసర్స్ భూపతి అసోసియేట్స్ మరియు ఫీనిక్స్ లివింగ్ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మండవ ప్రభాకర్ రావు మరియు ఇతరులతో** కొండాపూర్ గ్రామంలోని **సర్వే నం.104, 105, 106, 107 మరియు 108కి** సంబంధించి ఏ లావాదేవీలు కుదుర్చుకోరాదు.

ఈ బహిరంగ ప్రకటన తరువాత కూడా ఏ వ్యక్తి/వ్యక్తులు అయినా ఒప్పందాన్ని లేదా ఏర్పాటులను కనుక చేసినట్లయిన, దాని వలన తలెత్తే నష్టాలు ఖర్చులు మరియు పర్యవసానాలకు వారే బాధ్యత వహించాలి మరియు అటువంటి ఆసక్తి గల కొనుగోలు దారులు మొదలగు వారిపై తగిన చట్టపరమైన చర్యలను తీసుకొనే హక్కు నా క్లయింటు కలిగి ఉన్నారు.

సం/- లక్ష్మి ఐశ్వర్య, న్యాయవాది
ప్లాట్ నం.99. శ్రీ విఘ్నేశ్వర కాలని, గంధంగూడ, కెకె నగర్, ఫేజ్-2, హైదరాబాద్-91
Ph: 9177514671, aiswarya20519@gmail.com

ఉపాధిపై నిరుద్యోగులకు శిక్షణ

అడ్డగుట్ట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అప్పా టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్ విభాగంలో శిక్షణ, ఆతర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ సమన్వయ కర్త పురుషోత్తం తెలిపారు. హబ్సిగూడ బ్రాంచ్ వద్ద నాలుగు నెలల పాటు శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 20-27 ఏళ్ల వయసు ఉన్న బీఏస్సీ, ఎంఎస్సీ బీ-ఫార్మా, ఎం-ఫార్మా, బీకాం, ఎంకాం, విభాగాలలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని వివరించారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పించే బాధ్యత తమదేనని తెలిపారు. వివరాలు తెలుసుకునేందుకు 91549-90132, 91549-90131 నంబర్‌కు సమాచారం తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి పసుపు-కుంకుమ సమర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ అరుణ శ్రీనివాస్‌గౌడ్

మహాకాళికి ఐదు వారాల సాక సమర్పణ

సికింద్రాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): లష్కర్ బోనాల జాతర రంగం కార్యక్రమంలో భవిష్యవాణి ఆదేశించిన మేరకు శ్రావణ మాసంలో ఐదు వారాల పాటు అమ్మవారికి సాక సమర్పణ చేస్తున్నట్లు రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణశ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె అమ్మవారికి సాక సమర్పించారు. ప్రతి ఏడాదీ శ్రావణ మాసం శుక్రవారం రోజు ఆలయంలో తాము పసుపు-కుంకుమ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ ఏడాదీ ఘనంగా జరిపినట్టు తెలిపారు. ఆంజనేయులు, గణేష్, సతీష్, శివయ్య, కోటేశ్వర్, కిషోర్, బాలనరసింహ, అరుణ్‌భట్, రామ్మోహన్, అరుణ్, భరత్, సాయికుమార్, ప్రేమ్, శ్రీను, లావణ్య, దుర్గా, కస్తూరి, పుష్ప, నిర్మల, ఆశారాణి, అంజమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్

తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

పద్మారావునగర్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు శిశువుకు అందించడం ద్వారా పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని అంగన్‌వాడీ టీచర్ కుల్సుమ్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారుల తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే అందించాలన్నారు. ఎలాంటి ఇతర పదార్థాలు తినిపించటం, తాగించటం చేయరాదన్నారు.పైపాలు, ఇతర పదార్థాల ద్వారా పిల్లలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. వైద్యుల సలహాలు సూచనలు లేకుండా డబ్బా పాలు ఇవ్వరాదన్నారు. ఆరు నెలల కాలంలో శిశువు ఎదుగుదల, అభివృద్ధికి కావలసిన పోషకాలు తల్లిపాల నుంచే లభిస్తాయని తెలిపారు. పిలల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. శిశువు జన్మించిన గంటలోపు తల్లిపాలు అందించడం ఉత్తమమని తెలిపారు. అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హైటెక్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ దుర్గంచెరువులోకి దూకి ఓ యువకుడు మృతిచెందాడు. మాదాపూర్ ఎస్‌ఐ వినయరావు తెలిపిన వివరాల ప్రకారం.. తిరమలగిరి ఆర్టీసీ కాలనీకి చెందిన చంద్రేష్ జైన్ (34) వ్యాపారి. గతనెల 30న ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి వరకు ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు అల్వాల్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. ఫిర్యాదు చేసిన రోజే చంద్రేష్ జైన్ మృతదేహం దుర్గంచెరువులో కనిపించడంతో పోలీసులు బయటకు తీయించారు. పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు తరుణ్ జైన్ ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక పైపులైన్

బేగంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లోని గురుమూర్తి లైన్‌లో పలు విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్ టి.మహేశ్వరి శుక్రవారం పర్యటించారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పలువురు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక సివరేజీ పైపులైన్ కోసం నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకుడు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



గురుమూర్తి లైన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహేశ్వరి

చివరి మజిలిలోనూ చిక్కే!

- డివైడర్ అడ్డుగా ఉండటంతో రాంగ్‌రూట్‌లోకి స్వర్గధామం వాహనాలు
- రాజీవ్ రహదారిలో దుస్థితి ఇదీ
- తిరుమలగిరి, లోత్‌కుంట తదితర ప్రాంతాల వాసులకు తప్పని పాట్లు

మనిషి బతికున్నంత వరకు ఎన్నో రకాల బరువు బాధ్యతలు మోస్తాడు. వాటిని సాధించుకోడానికి శాయశక్తుల కష్టపడతారు. కాని మోక్షం పొందిన తర్వాత కూడా ప్రశాంతత లేకుండాపోతోంది. శ్మశాన వాటికకు తరలించే మార్గంలో డివైడర్ అడ్డుగా ఉండటమే కారణమని పలు ప్రాంతాల వాసులు చెబుతున్నారు.

తిరుమలగిరి అగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికకు రాజీవ్ రహదారి గుండా లోపలికి వెళ్లడానికి డివైడర్ అడ్డుగా ఉంది. దీంతో మృతదేహాలను తరలించే వాహనాలు రాంగ్ రూటులో వెళ్తున్నాయి. ఇది రాజీవ్ రహదారి.. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. అయితే అలా రాంగ్ రూటులో వెళ్తుంటే వాహనాలు అప్పుడప్పుడు ఒకదాని వెనుక ఒకటి ఢీకొంటున్నాయి. తిరుమలగిరి, లోత్‌కుంట, అల్వాల్, బొల్లారం, నేరెడ్‌మెట్ పలు ప్రాంతాల నుంచి మృతదేహాలను సంప్రదాయబద్ధంగా వాహనంలో స్వర్గధామంకు ఖననం చేయడానికి తీసుకువెళ్తుండటం అందుకు నిదర్శనం. అయితే స్వర్గదాంకు ఎదురుగా జాతీయ రహదారి అధికారులు, కంటోన్మెంటు అధికారులు ముందు చూపు లేకుండా డివైడర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ముందుగా ఉన్న యూ టర్న్ నుంచి రాంగ్ రూటులో మృతదేహాలను లోపలికి తీసుకుపోవాల్సిన పరిస్థితి. వాటిని స్వర్గధామంకు తరలించే ప్రయత్నంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థానిక పౌరులు ఎన్నో సార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. అవసరం లేని చోట అధికారులు డివైడర్‌ను ఓపెన్ చేస్తున్నారు. అదే ఉపయోగపడే ప్రాంతంలో మాత్రం డివైడర్‌ను ఏర్పాటు చేయకపోవడం సబబేనా అని స్థానికులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డివైడర్‌ను తొలగించాలని వేడుకుంటున్నారు.



లోత్‌కుంట శ్మశాన వాటిక

వెంటనే డివైడర్‌ను తొలగించాలి

లోత్‌కుంట లోని స్వరధామం ముందుగా ఉన్న డివైడర్ ను తొలగించి పౌరులకు న్యాయం జరిగేలా చూడాలి.



- డాక్టర్ నవీన్

మా దృష్టికి తీసుకొస్తే పరిశీలిస్తాం



స్వర్గధామం ముందున్న డివైడర్‌ను తొలగించాలని పౌరులు మా దృష్టికి తీసుకొస్తే పరిశీలిస్తాం. ఇప్పటి వరకు ఈ సమస్య నా దృష్టికి రాలేదు. అందరికి ఉపయోగపడే కార్యక్రమం కాబట్టి పరిశీలించి తొలగించేందుకు కృషి చేస్తాం

: మధుబాబు,
తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

కంటోన్మెంట్‌లో 1,150 కొత్త రేషన్ కార్డులు

- పరిశీలన దశలో 4,664 దరఖాస్తులు
- మంత్రి పొన్నం



కంటోన్మెంట్‌లో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆషాఢ బోనాల జాతర ముగిసి, ప్రస్తుతం రేషన్ కార్డుల జాతర నడుస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గతనెలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పండుగలు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం శ్రావణ మాస రేషన్ కార్డుల పంపిణీ విజయవంతంగా సాగుతోందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని లీ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో శుక్రవారం లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఆయన తన చేతుల మీదుగా పది మందికి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో హుజూరాబాద్, నాగార్జునసాగర్ ఉప ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే రేషన్ కార్డులు వచ్చేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించి, అమలు చేస్తున్నదని చెప్పారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 55 వేల రేషన్ కార్డులు ఇస్తున్నామని పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో 1,150 రేషన్ కార్డులు ఇస్తున్నామని, మరో 4,664 దరఖాస్తుల వెరిఫికేషన్ నడుస్తోందని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో లక్ష రేషన్‌కార్డుల వెరిఫికేషన్ కొనసాగుతోందని వెల్లడించారు. పది సంవత్సరాల తర్వాత రేషన్ కార్డులు వస్తుండడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, ఎక్కడ ఉపాధి పొందుతుంటే, అక్కడే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకానికీ రేషన్ కార్డు అవసరమని, ఇది ఇవ్వకపోతే సంక్షేమాలు పేదలకు అందకుండా చేయవచ్చనేది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ఉద్దేశమై ఉండొచ్చని విమర్శించారు. కేంద్ర రక్షణ శాఖ పరిధిలో ఉన్నందున కంటోన్మెంట్‌కు నిధుల సమస్య ఉందని, అందుకే ప్రత్యేక నిధులు కేటాయించి, కంటోన్మెంట్ అభివృద్ధికి సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, కలెక్టర్ దాసరి హరిచందనకు విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్‌లో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ పెండింగులో ఉందన్నారు. అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, మోండ మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులు ఐక్యంగా ఉండాలి

బోయినపల్లి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా ఐక్యంగా ఉండాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. శుక్రవారం ఆలయ ప్రెసిడెంట్ దుర్గయ్య ఆధ్వర్యంలో ఒడి బియ్యం వంటకాల అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి శాకాంబరీ అలంకరణలో ఉన్న బాపూజీ నగర్‌లోని ముత్యాలమ్మ ఆలయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఒడి బియ్యం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. హిందువులు దేవాలయాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని, ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకుంటూ ఐక్యతతో ఉండాలని సూచించారు. వివిధ కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విభేదాలను తొలగించి, ఒకరినొకరు సహాయం చేసుకోవడం ద్వారా, హిందూ సమాజం బలోపేతమవుతుందన్నారు. తామంతా ఐక్యంగా ఉండి తమ ధర్మం కోసం, హక్కుల కోసం పోరాడినప్పుడే హిందూ ధర్మపరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్, కుమార్, లక్ష్మణ్, నర్సింగ్ రావు, నర్సింహ, పేమ్‌కుమార్, పవన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



బాపూజీనగర్ ముత్యాలమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్, దుర్గయ్య

- ఓ సంప్రదాయ ఆచారం

అమ్మవారి ఒడి బియ్యంతో అన్నదానం. ఇది ఒక సంప్రదాయ ఆచారం, బియ్యాన్ని పేదలకు, అవసరమైనవారికి కూడా దానం చేస్తారు. అమ్మవారి ఒడి బియ్యంతో అన్నదానం అనేది ఒక పుణ్యకార్యంగా భావిస్తారు. ఇది భక్తులు తమ భక్తిని, దైవభక్తిని చాటుకోవడానికి, పుణ్యం సంపాదించడానికి చేసే ఒక మార్గం అని భావిస్తారు. ఇటీవల జరిగిన బోనాల జాతరలో ముత్యాలమ్మ ఆలయం అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున ఒడి బియ్యం సమర్పించి వారి మొక్కులను చెల్లించుకున్నారు.



ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రతాప్ తదితరులు

దేశానికే తెలంగాణ ఆదర్శం : కోట నీలిమ



సికింద్రాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కుల గణన, బీసీ రిజర్వేషన్లతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ తెలిపారు. కేంద్రం మెడలు వంచైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పార్టీ ప్రకటించిన మేరకు బీసీలకు 42శాతం రిజర్వే షన్లు కల్పించడం ద్వారా ఇచ్చిన హామీని నెరవేర్చి తీరుతామని శుక్రవారం ఓ ప్రకటనలో ఆమె తెలిపారు. బీసీలకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పేందుకే జనహిత పాదయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వంలో ఉన్న వారు పాదయాత్ర చేయడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారని, ఉచిత బస్సు మొదలు రేషన్ కార్డుల జారీ వరకు ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్నదని అందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇంకా ఏం కావాలో తెలుసుకునేందుకు, వారికి వాస్తవాలు తలిపేందుకు మరింత చేరువయ్యేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోనియాగాంధీ మాట ఇచ్చినందుకే అప్పుడు రాష్ట్రం ఏర్పడిందని, కాని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని విమర్శించారు. ఖర్గే, రాహుల్‌గాంధీలు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

రెజిమెంటల్‌బజార్,ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నలుగురిపై మార్కెట్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. వారి తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి పాట్ మార్కెట్‌లో నివాసం ఉంటున్న గెవల్ ఇంటికి అల్లుడు అభిషేక్ వచ్చాడు. తిరిగి కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న టకరాబస్తీకి చెందిన సాయికిరణ్ హారన్ కొట్టాడు. ఎందుకు హారన్ కొడుతున్నావని అభిషేక్ ప్రశ్నించగా ఇరువురి మధ్య గొడవకు దారి తీసింది. సమీప ప్రాంతం కావడంతో గమనించిన అభిషేక్ మామ గెవల్ ఇక్కడికి చేరుకొని సాయికిరణ్ మీద దాడి చేశాడు. సాయికిరణ్ తన స్నేహితుడు సాయిని పిలవగా అతనిపైనా గెవల్‌తో పాటు ధనరాజ్, మహావీర్, హితేష్‌లు దాడి చేశారు. గెవల్ తనను కులం పేరుతో దూషించడని సాయికిరణ్ మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాడి చేసిన నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ మోసం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్లాట్‌కొని పూర్తి డబ్బులు చెల్లించినా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంకే నగర్‌కు చెందిన ఎం.ధనలక్ష్మి జహీరాబాద్‌లో స్థలాన్ని రూ.3.75 లక్షలకు ఏజెంట్ బి.సాయిలు ద్వారా కొనుగోలు చేసింది. ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయకుండా కాలాక్షేపం చేయడంతో రియల్ ఎస్టేట్ ఆఫీస్‌కు వెళ్లింది. ఆఫీసును తీసివేయడంతో ధనలక్ష్మి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది.

ద్విచక్ర వాహనం మాయం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన వి. గంగాధర్‌రావు జూలై 30న కృష్ణకాంత్ పార్కు ఎదుట రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని పార్కు చేశాడు. కొంతసేపటికి వెళ్లి చూడగా బైక్ కనిపించ లేదు. దీంతో పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

ముమ్మరంగా శానిటేషన్ డ్రైవ్

ఖైరతాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శానిటేషన్ డ్రైవ్ జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో ముమ్మరంగా సాగుతోంది. రెండు రోజుల పాటు ఒక వార్డులో డ్రైవ్‌లు నిర్వహించి అందులో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ప్రత్యేక వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ఇందులో భాగంగా సర్కిల్-17లో ఇప్పటికే రూ.35 వేల జరిమానాలు విధించినట్టు ఉప కమిషనర్ జయంత్ తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్ ఎదుట తవ్వకాలు జరిపి వ్యర్థాలను అక్కడే వదిలేసినందుకు రూ.5 వేలు, ఎల్లారెడ్డిగూడలోని స్క్రాప్ వ్యాపారి ఫుట్‌పాత్‌పై స్క్రాప్ మెటీరియల్‌ను వేయడంతో ఆయనకు రూ.25 వేల జరిమానాను ఉప కమిషనర్ విధించారు. దీంతోపాటు పలు ప్రాంతాల్లో రోడ్లపై అనమతి లేకుండా వ్యర్థాలను జారవిడిచిన నలుగురికి రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇప్పటి వరకు ఖైరతాబాద్, సోమాజిగూడ వార్డుల్లో డ్రైవ్ పూర్తి కాగా, అమీర్‌పేట, సనత్‌నగర్‌లలో జరగాల్సి ఉంది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆకట్టుకుంటున్న మహేంద్ర హిల్స్ పార్క్

జిమ్ చేస్తున్న మహిళలు



- పచ్చదనంతో ఉద్యానవనం కళకళ
- స్కేటింగ్ గ్రౌండ్, ఓపెన్ జిమ్ సహా ఇతర సదుపాయలు
- పిల్లల కోసం ఆటవస్తువులు, స్పోర్ట్స్ కోర్టు సైతం..
- నిత్యం సందర్శకులతో కిటకిట
- గతేడాది అందుబాటులోకి పార్క్

పెద్దలు, యువత, చిన్నారులు .. అంతా కలిసి ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతున్నారు. పచ్చదనం.. ఆకర్షిస్తుండగా.. ఆహ్లాదం ఆనందాన్ని పంచుతోంది. ఆరోగ్యం కాపాడుకునేందుకు ఓపెన్ జిమ్ దోహదపడుతోంది. వాటర్ ఫౌంటెన్ మనసు దోచేస్తోంది. ఉద్యానవనం పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. బుద్ధుడి విగ్రహం ఆకట్టుకుంటున్నది. హిల్స్ కొండలోయల్లోని గ్రీనరీ సైతం కళ్లకు ఇంపుగా కనిపిస్తోంది. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల్లోని వాసులు కూడా ఉదయం, సాయంత్రం సమయాల్లో సేదదీరుతున్నారు. ఇదంతా మహేంద్ర హిల్స్ పార్క్ సొంతం..

మారేడుపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ మహేంద్రహిల్స్‌లో పార్క్ ఏర్పాటు చేశారు. హిల్స్ కొండలోయల్లో ఎకరా విస్తీర్ణ స్థలంలో దాదాపు 6.5 కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ పార్క్ ఈ ప్రాంత వాసులకు ఆహ్లాదం ఆనందం పంచుతోంది. ఈ పార్క్ గత సంవత్సరం నుంచి ప్రజలకు, కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని చుట్టూ 10 కాలనీలు ఉన్నాయి. స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించడానికి వందలాది మంది సీనియర్ సిటిజన్స్, చుట్టూ ఇతర పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడికి వచ్చి సేదదీరుతున్నారు. ఉద్యానవనం, పిల్లలు ఉయ్యాలలు, జారుడు బల్లలు, ఆట వస్తువులను ఇక్కడ ఏర్పాటు చేశారు. స్కేటింగ్ గ్రౌండ్, ఓపెన్ జిమ్, ఆడిటోరియం, విశ్రాంతి స్థలాలు, గ్రీనరీ, వివిధ రకాల మూలికల చెట్లు, పూల చెట్లు, వ్యాయామ మైదానం, మెడిటేషన్, స్పోర్ట్స్ కోర్టు, బుద్ధుడి విగ్రహం, వాటర్ ఫాల్స్ వంటివి ఆకట్టుకుంటున్నాయి. స్థానికులతో పాటు సందర్శకులతో ఉద్యానవనం కిటకిటలాడుతోంది.



ఉద్యానవనం

సందర్శకుల తాకిడి ఎక్కువ

కంటోన్మెంట్‌లోనే అతిపెద్ద పార్కు మహేంద్రహిల్స్. చిన్నారులు, సీనియర్ సిటిజన్స్ కోసం సకల సౌకర్యాలు కల్పించాం. ఇక్కడి ప్రాంత ప్రజలు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి అక్కడ స్థానికంగా ఉన్న పార్కుల్లో వాకింగ్, కాలక్షేపం చేసేవారు. గతేడాది స్థానికంగా పార్కు అందుబాటులోకి వచ్చింది. సందర్శకుల తాకిడి రోజురోజుకూ ఎక్కువ కావడం సంతోషం కలిగిస్తోంది.

జె.అనురాధ రామకృష్ణ
కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు మాజీ మెంబర్